క్లుప్తంగా

పుల్లలపాడు గ్రామ సచివాలయంలో చోరీ



సచివాలయంలో కంప్యూటర్లు లేని డెస్క్‌లు

నల్లజర్ల: పుల్లలపాడు గ్రామ సచివాలయంలో చోరీ జరిగింది. గురువారం రాత్రి తాళాలు పగులగొట్టి మూడు కొత్త కంప్యూటర్లు, ఒక పాత కంప్యూటర్‌ను దొంగలు ఎత్తుకెళ్లినట్టు ఆ గ్రామ ఇన్‌చార్జి కార్యదర్శి మూర్తి శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇక్కడ ఇలా జరగడం ఇది రెండోసారి. ఊరికి సచివాలయం దూరంగా ఉండడంతో చోరీలకు అనుకూలంగా ఉంది. గతేడాది మేలో ఇదే విధంగా తాళాలు పగులగొట్టి బోరునకు ఉన్న మోటారు, కొన్ని ఫైల్స్, సామగ్రి ఎత్తుకెళ్లారు. అప్పుడు కూడా పోలీసులకు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేకుండా పోయిందని సిబ్బంది చెబుతున్నారు. ఎత్తుకెళ్లిన కంప్యూటర్లలో విలువైన డేటా ఉందని డిజిటల్ అసిస్టెంట్ విజయశ్రీ చెప్పారు.

ముందస్తు జాగ్రత్తతో దోమల నివారణ

నల్లజర్ల: సీజనల్‌గా వచ్చే వ్యాధులపై ముందస్తు ప్రణాళికల ద్వారా నివారించవచ్చని తాడేపల్లిగూడెం మలేరియా సబ్ యూనిట్ అధికారి వై.వి. లక్ష్మణరావు ప్రజలకు వివరించారు. శుక్రవారం ఘంటావారిగూడెంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారంలో ఒక రోజు డ్రైడేగా పాటించడం ద్వారా దోమల ద్వారా వచ్చే వ్యాధులను నివారించవచ్చన్నారు. గృహ సందర్శనలో పరిసరాలను పరిశీలించారు. వచ్చిన జ్వరం ఏదైనా ఆరోగ్యఅధికారులను సంప్రదించాలన్నారు. కీటకజనిత నియంత్రణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆరోగ్య కార్యదర్శి సువర్ణ, ఎం.ఎల్.హెచ్.పి దీపిక, ఆశ కార్యకర్తలు శాంతమణి, కుమారి, రాణి, వలంటీర్ శ్రీదేవి పాల్గొన్నారు.

ఆసుపత్రికి వెళ్లి.. పింఛను అందించి..



ఆసుపత్రిలో జనార్దన్‌కు పింఛను అందిస్తున్న వలంటీర్ మేరీరత్నం

నల్లజర్ల: వైఎస్సార్ పింఛను కానుక ఒకటో తేదీన లబ్ధిదారులందరికీ వలంటీర్లు అందజేశారు. అనంతపల్లికి చెందిన కెల్లా జనార్దన్ అనారోగ్యంతో ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని తెలుసుకొని అక్కడకు వెళ్లి వలంటీర్ గురిమిమిల్లి మేరీరత్నం పింఛను అందించారు. సర్పంచ్ కమలకుమారి, ఉప సర్పంచ్ కలం సత్యనారాయణ వలంటీర్‌ను అభినందించారు.

మహా కుంభాభిషేకం ప్రారంభం



హోమం నిర్వహిస్తున్న పండితులు

పెరవలి: మల్లేశ్వరంలో ఉన్న కపిల మల్లేశ్వరస్వామి వారి ఆలయంలో మహా కుంభాభిషేకం వైభవంగా ప్రారంభమైంది. వందలాది మంది భక్తుల సమక్షంలో వేద పండితుల మంత్రోచ్చరణ మధ్య పూజలు జరిగాయి. తుని తపోవనం పీఠాదిపతి సచ్చిదానంద సరస్వతి సమక్షంలో వేద పండితులు పూజ్యం విశ్వనాథశర్మ, వెలవలపల్లి సోమేశ్వరశర్మ ఆధ్వర్యంలో ఉదయం నుంచి సాయంత్రం వరకూ విశేష పూజలు నిర్వహించి సాయంత్రం పురాణ ప్రవచనాలు చేశారు.

పల్స్ పోలియోపై అవగాహన

చాగల్లు : పిల్లల ఆరోగ్యవంతమైన జీవితం కోసం రెండు పోలియో చుక్కలు వేసి పోలియో మహమ్మారిని తరిమేద్దామని రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు సభ్యులు, బ్రాహ్మణగూడెం ఇంటరేక్ట్ క్లబ్ మహిళా సభ్యుల ఆధ్వర్యంలో బ్రాహ్మణగూడెం గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు కీర్తి ఆంజనేయులు మాట్లాడుతూ పోలియో వ్యాధిని మన దేశం నుంచి సమూలంగా నిర్మూలించేందుకు రోటరీ అంతర్జాతీయ సంస్థ కృషి చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ గవర్నర్ పొలదాసు శ్రీనివాసరావు, యాసరపు రామకృష్ణ, గుంటుపల్లి శివకుమార్, కాళ్ళ రాంబాబు, పొన్నా సుబ్రహ్మణ్యం, శ్రీనివాస్, రామారావు , ప్రవల్లిక, సాయితనూశ్రీ, మోహనప్రియ, హెచ్ఎం టి.విజయకుమార్, రోటరీ సభ్యులు, ఇంటరాక్ట్ సభ్యులు విద్యార్థులు పాల్గొన్నారు.

సబ్సిడీపై నిత్యావసరాలు

కొవ్వూరు: కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో సబ్సిడీ ధరలపై అందిస్తున్న నిత్యావసర సరుకులను బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలో 23వ వార్డులో పంపిణీ చేశారు. పెరిగిన నిత్యవసర ధరలను దృష్టిలో ఉంచుకుని కేంద్రం సబ్సిడీపై సరుకులు అందిస్తున్నట్టు బీజేపీ నాయకుడు గంగ్రోతు పవన్ తెలిపారు. దళిత మోర్చా నాయకులు బూసి సురేంద్రనాద్ బెనర్జీ, పట్టణ శాఖ అధ్యక్షుడు రామచంద్ర రావు, కృష్ణ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతే సర్కారు లక్ష్యం

- మంత్రి తానేటి వనిత
- గ్రామాల్లో పరిచయ కార్యక్రమాలు



లక్ష్మీపురంలోని పరిచయ సభలో మాట్లాడుతున్న మంత్రి తానేటి వనిత



గౌరీపట్నంలో ఆర్బీకే భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి వనిత

దేవరపల్లి: మహిళా సాధికారత సాధించడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆర్థిక చేయూత అందిస్తున్నారని రాష్ట్ర హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి తానేటి వనిత అన్నారు. దేవరపల్లి మండలంలోని లక్ష్మీపురం, గౌరీపట్నం, దుద్దుకూరు, రామన్నపాలెం గ్రామాల్లో శుక్రవారం వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులు పరిచయ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీపురంలో పార్టీ మండల కన్వీనర్ కూచిపూడి సతీష్ అధ్యక్షతన జరిగిన సభలో మంత్రి తానేటి వనిత గ్రామ వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు, పార్టీ నాయకులు, కార్యకర్తలను ఆమె పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా బలపడడానికి సీఎం జగనన్న ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. అక్కచెల్లెమ్మల సొంతింటి కల నెరవేర్చడానికి రాష్ట్రంలో 32 లక్షల గృహాలను కట్టిస్తున్నట్టు ఆమె చెప్పారు. మహిళల పేరున ఇళ్లస్థలాలు, ఇల్లు మంజూరు చేసినట్టు ఆమె వివరించారు. అన్ని వర్గాల వారికి ఆర్థికంగా ఆదుకున్నారు. జగనన్న వల్లే సంక్షేమ పాలన సాధ్యమవుతుందని, త్వరలో జరగనున్న ఎన్నికల్లో రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని ఆమె కోరారు. పార్లమెంట్ సభ్యుడిగా గూడూరి శ్రీనివాస్, ఎమ్మెల్యేగా తనను అత్యధిక మెజార్టీతో గెలిపించి జగనన్నకు బహుమతిగా ఇవ్వాలని ఆమె కోరారు. తొలుత స్థానికంగా ఉన్న హరహర క్షేత్రాన్ని మంత్రి తానేటి వనిత సందర్శించి శివాలయం, వేంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆమెకు పూర్ణకుంభంతో స్వాగతం పలికి ఆశీర్వచనం ఇచ్చారు. ఘనంగా సన్మానించి, స్వామి వారి చిత్రపటాన్ని, తీర్థప్రసాదాలను అందజేశారు. గ్రామంలోని దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు మంత్రి వనిత పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సర్పంచ్ దోనెల్లి ధనలక్ష్మి, జానకీరాం దంపతులు మంత్రి వనితను గజమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమాల్లో ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్దనరావు, ఎంపీపీ కేవీకే దుర్గారావు, రాష్ట్ర పామాయిల్ బోర్డు డైరెక్టర్ నరహరిశెట్టి రాజేంద్రబాబు, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు ఎం.గంగరాజు, నియోజకవర్గ అధికార ప్రతినిధి గడా జగదీష్, మండల మహిళా అధ్యక్షురాలు కె.హైమావతి, మండల సచివాలయాల కన్వీనర్ కుసులూరి వెంకటసతీష్, గౌరీపట్నం సర్పంచ్ రాయి అన్నపూర్ణ, దుద్దుకూరు సర్పంచ్ బొంతా నాగమణి, సొసైటీ అధ్యక్షులు కాండ్రు రామకృష్ణ, గుత్తికొండ అచ్యుతరావు, నాయకులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

రైతు భరోసా కేంద్ర భవనం ప్రారంభం

దేవరపల్లి: గౌరీపట్నంలో సుమారు రూ.21.80 లక్షల వ్యయంతో నిర్మించిన వైఎస్సార్ రైతు భరోసా కేంద్రం భవనాన్ని శుక్రవారం సాయంత్రం మంత్రి తానేటి వనిత ప్రారంభించారు.

సచివాలయం ప్రారంభం



సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

గోపాలపురం: వెంకటాయపాలెంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రాలను శనివారం ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ, జెడ్పీటీసీ కాకులపాటి లలిత ప్రారంభించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారని ఎంపీపీ సత్యనారాయణ అన్నారు. ప్రతి గ్రామంలోనూ సచివాలయం, ఆర్‌బీకే, ఆరోగ్య కేంద్రాలతోపాటు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండేలా వలంటీర్లు, సచివాలయ వ్యవస్థలను రూపొందించినట్టు తెలిపారు. సర్పంచ్ మేకా సతీష్‌బాబు, ఉపసర్పంచ్ వడ్లమూడి రాజేంద్రప్రసాద్, మండల పార్టీ కన్వీనర్ పోతిరెడ్డి నాగరాజు, నాయకులు రమేష్‌బాబు, శ్రీనివాసరెడ్డి, పెనుగొండ బాలాజీ, సత్యనారాయణ, నాయకులు పాల్గొన్నారు.

పేదల పెన్నిధి సీఎం జగన్



పెద్దేవంలో పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే తలారి

- వైఎస్సార్ సీపీ కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్యే తలారి వెంకటరావు
- పెద్దేవంలో గడప గడపకూ మన ప్రభుత్వం

తాళ్లపూడి: నిరంతరం పేద ప్రజల గురించి, వారి అభివృద్ధి గురించి ఆలోచిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేసుకోవాలని వైఎస్సార్ సీపీ కొవ్వూరు నియోజక వర్గ ఇన్‌చార్జి, గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. పెద్దేవంలో శుక్రవారం రెండో రోజు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ కాపు జేఏసీ నాయకులు తోట రామకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తలారి అధికారులు, నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. వారి సమస్యలు తెలుసుకొని పరిష్కరించారు. స్థానిక జనార్ధ స్వామి ఆయలంలో పూజలు నిర్వహించారు. ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు, ఏఎంసీ వైస్ చైర్మన్ కొలిశెట్టి నాగేశ్వరరావు, మండల కన్వీనర్ కాకర్ల వెంకటేశ్వరరావు, సర్పంచ్ తిగిరిపల్లి వెంకటరావు, నాయకులు తోట రామకృష్ణ, గంధం సాయి, పిట్టా శ్రీనివాస్, నామా ప్రకాశం, మైలవరపు రాధాకృష్ణ, సిర్రా గంగారావు, బట్టు సుబ్బారావు, పంచాయతీ కార్యదర్శి సువర్చల ఆలేఖ్య, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సచివాలయాలతో ప్రజల చెంతకే పాలన

- ఎమ్మెల్యే తలారి వెంకట్రావు
- ఆరికిరేవుల గ్రామంలో సచివాలయం ప్రారంభం



ఆరికిరేవులలో సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

కొవ్వూరు: దేశంలో ఎక్కడా లేని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో సచివాలయం, వలంటీర్ల వ్యవస్థను తీసుకొచ్చి ప్రజల చెంతకే పాలన తీసుకొచ్చారని ఎమ్మెల్యే, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి తలారి వెంకట్రావు పేర్కొన్నారు. శుక్రవారం ఆరికి రేవుల గ్రామంలో రూ.40లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పాదయాత్ర సమయంలో జగన న్న గ్రామ స్వరాజ్యాన్ని తీసుకోస్తానని, ప్రతీ 50 కుటుంబాలకు వలంటీర్‌ను నియమించి సంక్షేమ పథకాలు ప్రజల చెంతకే చేరవేస్తామని ప్రకటించారన్నారు. ఇచ్చిన మాట ప్రకారం ఎటువంటి వివక్షత చూపకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ అన్ని సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. ఈ ప్రభుత్వాన్ని రానున్న ఎన్నికల్లో ఆశీర్వదించాలని కోరారు. స్థానిక నాయకులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోసిన శ్రీలేఖ, మాజీ ఏఎంసీ చైర్మన్లు బండి పట్టాభిరామారావు, వల్లభశెట్టి శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు చౌటుపల్లి వీరన్న, సర్పంచ్ మట్టా శ్రీనివాస్,సొసైటీ అధ్యక్షుడు చావా నానిబాబు, మండల పార్టీ అధ్యక్షుడు సుంకర సత్యనారాయణ, ఉప సర్పంచ్ మల్లిపూడి వెంకట్రావు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు ప్రారంభం



వేగేశ్వరపురంలో విద్యార్థులను తనిఖీ చేసి పంపుతున్న పోలీసులు

తాళ్లపూడి: వేగేశ్వరపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరం పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. పరీక్షా కేంద్రానికి ఉదయం 8 గంటల నుంచే విద్యార్థులు చేరుకున్నారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం తెలుగు/సంస్కృతం 215 మంది విద్యార్థులకు గాను 204 మంది పరీక్ష రాశారు. 11 మంది గైర్హాజరయ్యారు. కళాశాల ప్రిన్సిపాల్, చీఫ్ సూపరింటెండెంట్ పి.గౌరీనాథ్ పరీక్షలను పర్యవేక్షించారు.

నిడదవోలు: ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సర పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి.కొవ్వూరు డివిజన్‌లో పరిధిలో 15 పరీక్షా కేంద్రాలను అధికారలు ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాలలో మొత్తం 5,144 మంది విద్యార్థులకు గాను మొదటి రోజు 4,114 మంది పరీక్షకు హాజరయ్యారు. 128 మంది గైర్హజరయ్యారు. పరీక్షా కేంద్రాల వద్ద మంచినీటి సౌకర్యం కల్పించారు. పోలీస్ బందోభస్తుతో పాటు ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపులను సైతం ఏర్పాటు చేశారు.

మొదటి రోజు ఒక విద్యార్థి గైర్హాజరు

చాగల్లు: స్థానిక వెలగపూడి రామకృష్ణ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో శుక్రవారం ప్రారంభమైన ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలకు 268 మంది విద్యార్థులకు గాను ఒక విద్యార్థి గైర్హాజర్ అయినట్టు కళాశాల ప్రిన్సిపాల్ పావని తెలిపారు.

ఆరోగ్యశ్రీ రిఫరల్ రోగులకు ఆర్థిక సాయం అందజేత

నిడదవోలు: పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ అన్నారు. పట్టణంలోని నెహ్రూనగర్ వైఎస్సార్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్, ఎన్టీఆర్ కాలనీ వైఎస్సార్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ పరిధిలో గతేడాది సెప్టెంబర్‌లో నిర్వహించిన జగనన్న సురక్ష ఫేజ్ 01లో భాగంగా ఆరోగ్యశ్రీకి రిఫర్ చేసిన రోగులకు ప్రభుత్వం మంజూరు చేసిన రిఫరల్ ఫండ్ రూ.12,500 రూపాయలను 25 మంది రోగులకు శుక్రవారం ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు ఈ. తేజశ్రీ, ప్రసన్నకుమార్, కౌన్సిలర్లు పువ్వుల రతీదేవి, గోపిరెడ్డి శ్రీనివాస్, ఆకుల ముకుందరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు మొదలవలస నాని, మేడపాటి రామ్మోహన్‌రెడ్డి, సచివాలయ హెల్త్ కార్యదర్శులు, సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.



నగదు అందిస్తున్న మున్సిపల్ చైర్మన్ ఆదినారాయణ

పట్టణాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తాం

నిడదవోలు: పట్టణాభివృద్ధిలో భాగంగా అన్ని వార్డులలో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలతో పాటు ప్రధాన సెంటర్లలో పట్టణ సుందరీకరణ పనులు పూర్తి చేసినట్టుచేస్తామని మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ అన్నారు. పట్టణంలో పంపింగ్‌యార్డులో 15 ఆర్థిక సంఘ నిధులు రూ.16 లక్షల వ్యయంతో నిర్మించనున్న ప్రహరీ పనులకు శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు.

మహిళా మార్ట్‌లతో ఆర్థిక చేయూత

- చేయూత డీపీఎం రాజబాబు
- మార్ట్ కమిటీ సభ్యులతో సమావేశం



నల్లజర్లలో మార్ట్ కమిటీ సభ్యులతో సమావేశమైన డీపీఎం రాజబాబు

నల్లజర్ల: జగనన్న చేయూత మహిళా మార్ట్‌లు వ్యాపార పురోభివృద్ధికి గ్రామాల్లో సమావేశాలు ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కలిగించాలని చేయూత డీపీఎం రాజబాబు మార్ట్ కమిటీ సభ్యులకు సూచించారు. నల్లజర్ల వైఎస్సార్ క్రాంతిపథం కార్యాలయంలో మార్ట్ కమిటీ సమావేశం శుక్రవారం మండల సమాఖ్య అధ్యక్షురాలు ప్రసన్నకుమారి అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన డీపీఎం మాట్లాడుతూ మార్కెట్ ధరల కంటే తక్కువ ధరలకు నాణ్యమైన నిత్యావసర సరకులు మార్ట్‌ల్లో లభిస్తాయని ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. తక్కువ ధరలకు సరకులు అందించేందుకు డ్వాక్రా మహిళల ఆధ్వర్యంలో మార్ట్ ఏర్పాటు చేసినట్టు వివరించాలన్నారు. సూపర్ బజార్‌ల తరహాలో ఇవి నడుస్తున్నాయని, మిగిలిన వ్యాపారుల కంటే తక్కువ ధరలకే అన్ని వస్తువులు లభిస్తాయని తెలియజేయాలన్నారు. ఐటీసీ, హిందుస్థాన్ లివర్, రిలయన్స్, అమూల్ వంటి సంస్థలతో ఒప్పందాలు చేసుకున్నట్టు చెప్పారు. పాఠశాలల్లో మధ్యాహ్నాన భోజన పథకం, వసతిగృహాలకు సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. డ్వాక్రా మహిళల్ని వ్యాపారవేత్తలుగా మార్చాలని లక్ష్యంతో సీఎం జగన్ ఈ మహిళా మార్ట్‌లకు శ్రీకారం చుట్టారన్నారు. మార్టులకు సంవత్సరానికి 180 రోజులు పాలు పోసిన మహిళా రైతులకు లాయల్టీ ఇన్సెంటివ్ రూపంలో అదనంగా లీటర్‌కు 50 పైసలు బోనస్ చెల్లించనున్నట్టు డీపీఎం రాజబాబు తెలిపారు. దాణా కొనుగోలుకు రూ.35 వేల నుంచి రూ.50 వేల వరకు రుణ సహాయం అందిస్తున్నట్టు చెప్పారు. పాడి గెదేలు కొనుగోలకు బ్యాంకుల నుంచి రూ.1లక్ష వరకు రుణ సహాయం అందిస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం విజయ నిర్మలకుమారి, సీసీలు జ్యోతి, మాలినీ, మార్ట్ సభ్యులు గుత్తికొండ సత్యవతి, పాతూరి శేషారత్నం, జవహరున్నీసా, మారెం కనక దుర్గ, తులసీరత్నం తదితరులు పాల్గొన్నారు.

కొవ్వూరు మున్సిపల్ కమిషనర్‌గా డానియేల్ జోషఫ్



కొవ్వూరు: కొవ్వూరు మున్సిపల్ కమిషనర్‌గా డానియేల్ జోషఫ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రొద్దుటూరు మున్సిపల్ ఆర్ఓగా పనిచేసిన జోషఫ్ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ కమిషనర్‌గా పనిచేసిన బి.శ్రీకాంత్ బాపట్ల మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ అయ్యారు. డానియల్ జోషఫ్ గతంలో కనిగిరి, పొదిలి మున్సిపల్ కమిషనర్‌గా పనిచేశారు. ఆయనను మున్సిపల్ మేనేజర్ జి.రాధాకృష్ణ, టీపీఓ శ్రీధర్, ఏఈలు దుర్గాకిషోర్, సుమంతలు అభినందనలు తెలిపారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు నాక్ బీప్లస్ గ్రేడు

నిడదవోలు: స్థానిక ఎస్వీఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు నాక్ బీ ప్లస్ గ్రేడును ప్రదానం చేసిందని ప్రిన్సిపాల్ కె. జ్యోతి తెలిపారు. గత నెలలో కళాశాలలో రెండు రోజుల పాటు నాక్ బృందం సందర్శించింది. దీనిలో భాగంగా కళాశాలలో బోధనా వసతులు, అధ్యాపకుల పరిశోధన, ఐదేళ్ళలో వివిధ రంగాల్లో సాధించిన అభివృద్ధి, అధ్యాపకుల పనితీరు వంటి అంశాలను నాక్ బృంద సభ్యులు పరిశీలించారు. ఈ మేరకు ఎస్వీఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు నాక్ బృందం బీ ప్లస్ గ్రేడును ప్రదానం చేసింది.

రబీ ఈ-పంట నమోదు పూర్తి

కొవ్వూరు: రబీ సీజన్‌కి సంబంధించి సాగు చేస్తున్న పంటల వివరాలను ఈ-పంటలో నమోదు ప్రక్రియ నూరు శాతం పూర్తయ్యిందని మండల వ్యవసాయ శాఖాధికారి ఎ.గంగాధర రావు తెలిపారు. ప్రతి గ్రామంలో రైతు భరోసా కేంద్రాల్లో రైతుల పరిశీలనార్థం జాబితాలను అందుబాటులో ఉంచామన్నారు. రైతులందరితో ఈ-కేవైసీ చేయించినట్లు చెప్పారు. పంట నమోదు ఆధారంగానే ధాన్యం కొనుగోలు, పంట నష్టం అంచనా, పంటల బీమా రైతులకు అందుతాయన్నారు. మార్చి మూడో తేదీ వరకూ సోషల్ ఆడిట్‌లో భాగంగా మూడు రోజుల పాటు జాబితాలు ఆర్‌బీకేల్లో అందుబాటులో ఉంటాయన్నారు. కావున పంట వివరాలు నమోదులో ఏవైన అభ్యంతరాలుంటే రైతులు గ్రామ వ్యవసాయ సహాయకులు దృష్టికి తీసుకుని రావాలని కోరారు.

రైతులకు అందుబాటులో ఆర్బీకేలు



వేలివెన్నులో ఆర్బీకే-2ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

ఉండ్రాజవరం: రైతులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు గ్రామాల్లోనే అందుబాటులో ఉండేలాగా రైతు భరోసా కేంద్రాలు (ఆర్బీకేలు) ఏర్పాటు చేశారని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. వేలివెన్ను గ్రామంలో సుమారు రూ.72 కోట్లు నూతనంగా నిర్మించిన ఆర్బీకేలు 1, 2, 3 లను శుక్రవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. జెడ్పీటీసీ సభ్యుడు నందిగం భాస్కరరామయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు మాట్లాడారు. మండల కేంద్రాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఆర్‌బీకేల ద్వారా రైతులకు సంబంధించిన అన్ని సేవలు వారి వద్దకే తీసుకువచ్చారన్నారు. గ్రామంలో సుమారు రూ.11.32 కోట్లు వివిధ అభివృద్ధి పనులు చేపట్టినట్లు చెప్పారు. అనంతరం మండలంలో దమ్మెన్ను గ్రామంలో రూ.43.60 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని ఆయన ప్రారంభించారు. గ్రామ సర్పంచ్ గుర్లజర్ల సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బూరుగుపల్లి సుబ్బారావు, వైస్ ఎంపీపీ చెట్టే నవీన్, సొసైటి అధ్యక్షుడు బూరుగుపల్లి కృష్ణబ్రహ్మానందం, ఆర్బీకేల చైర్మన్లు నాదేళ్ల నరేంద్ర, బూరుగుపల్లి రాజు, బూరుగుపల్లి సురేష్, ఎంపీటీసీ సభ్యురాలు మల్లిపూడి పాప, దమ్మెన్ను ఎంపీటీసీ గెడ్డం రామకృష్ణ, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

వచ్చేది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే

- ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు
- శెట్టిపేటలో గడప గడపకూ మన ప్రభుత్వం



శెట్టిపేటలో పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు, పార్టీశ్రేణులు

నిడదవోలు రూరల్: రాష్ట్రంలో మళ్లీ వచ్చేది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమేనని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు అన్నారు. శెట్టిపేట గ్రామంలో ఆధ్వర్యంలో సర్పంచ్ జడ్డు శ్రీలక్ష్మి, ఎంపీటీసీ సభ్యుడు బయ్యే కృష్ణబాబు ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు 57 నెలలుగా అందించిన సంక్షేమ పథకాలను వివరిస్తూ బుక్‌లెట్‌లను అందజేశారు. శెట్టిపేట గ్రామంలో రూ.15.66 కోట్ల సంక్షేమ పథకాలు, రూ.5.78 కోట్లతో అభివృద్ధి పనులు చేశామన్నారు. స్థానికులు పింఛన్లు, రేషన్‌కార్డులు, ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరగా వాటి పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు, మాజీ ఎంపీపీ మన్యం సూరిబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు కురసాల నెహ్రూ, జడ్డు రాంబాబు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీకి అమ్ముడు పోయిన పవన్

- పవన్ తీరుపై వైఎస్సార్ సీపీ కాపు సంఘం నాయకులు మండిపాటు
- ముఖ్యమంత్రి పై విమర్శలు చేస్తే ఉపేక్షించమని హెచ్చరిక



కొవ్వూరులోని విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ కాపు సంఘం నాయకులు

కొవ్వూరు: పవన్ కల్యాణ్ టీడీపీ నుంచి రూ.3వేల కోట్లు ప్యాకేజీ తీసుకుని అమ్ముడుపోయాడని మాజీ ఏఎంసీ చైర్మన్ బండి పట్టాభి రామారావు (అబ్బులు) ఆరోపించారు. శుక్రవారం పట్టణంలో ఎమ్మెల్యే తలారి వెంకట్రావు క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాపుల మనోభావాలను దెబ్బతీసేలా పవన్ వ్యాఖ్యాలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. కాపు ఉద్యమ నేత ముద్రగడను, ఆయన కుటుంబాన్ని చంద్రబాబు అరెస్టు చేయించి హింసించినప్పుడు పవన్ కల్యాణ్ ఏనాడు కనీసం పరామర్శించిన దాఖల్లేవన్నారు. సినిమా హీరోగా అభిమానిస్తున్న కాపు యువతని సైతం మోసం చేసిన ఘనత పవన్‌కే దక్కుతుందన్నారు. టీడీపీతో అంటకాగుతూ అమరావతిలో 150 ఎకరాల భూములు తీసుకోవడం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. వైఎస్సార్ సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు చౌటుపల్లి వీరన్న మాట్లాడుతూ ముఖ్యమంత్రిపై పవన్ అనుచితమైన వ్యాఖ్యాలు మానుకోవాలని హితవు పలికారు. జగన్‌ని పాతాళానికి తొక్కుతానంటూ విర్రవీగుతున్న పవన్‌ను భవిష్యత్‌తో చంద్రబాబే రాజకీయంగా పాతాళానికి తొక్కుతారన్నారు. అభిమానంతో జనసేనలో తిరుగుతున్న కార్యకర్తలను నా నిర్ణయానికి కట్టుబడి జై కొట్టే వాళ్లే నా వెంట ఉండండి అంటున్న నువ్వే ఒక పెద్ద సైకోవన్న విషయం గుర్తుంచుకోవాలన్నారు. వచ్చే ఎన్నికల్లో జనసేన-టీడీపీ పొత్తుని జగన్‌మోహన్‌రెడ్డి పాతాళానికి తొక్కుతారన్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి గంధం శేషసాయి మాట్లాడుతూ చంద్రబాబు తనకు ఎలాగు ఓట్లు వేయరని గుర్తించి ఇతర పార్టీలతో పొత్తులు పెట్టుకున్నారని విమర్శించారు. జనసేన-టీడీపీ పొత్తుని ఏ ఒక్క కాపు యువత జీర్ణించుకోలేక పోతున్నారని అన్నారు. జనసేన పార్టీ స్థాపించి పన్నెండు కావస్తున్నా నేటికీ క్షేత్ర స్థాయిలో నిర్మాణం చేసుకోలేని అసమర్థుడు పవన్ అని విమర్శించారు. కాపు పెద్దలపై సంస్కార హీనంగా మాట్లాడడం ఎంత వరకు సమజసం అని ప్రశ్నించారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు సుంకర సత్యనారాయణ మాట్లాడుతూ కాపుల్నీ చంద్రబాబుకి తాకట్టు పెట్టి రాజకీయంగా పబ్బం గడుపుకొంటున్న పవన్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించే స్థాయి కాదన్నారు. కాపు సంఘం నాయకులు తిరుమలశెట్టి వీర వెంకట సత్యనారాయణ(అన్నవరం) మాట్లాడుతూ చిరంజీవి కుటుంబంపై అభిమానంతో రాజకీయాల్లోకి ఎంతో మంది కాపులు నాయకులు ఉన్న ఆస్తులు పోగొట్టుకున్నారన్నారు. పీఆర్‌పీలో సీట్లు అమ్ముకుంటే ఇప్పుడు పవన్ తన పార్టీనే చంద్రబాబుకి అమ్ముకుని కాపుల్నీ మరోసారి మోసం చేశారన్నారు. పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు సిద్దన వాసు, కాపు సంఘం నాయకుడు గంగ్రోతు శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.